# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-13-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 316 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## డీలిమిటేషన్‌పై రాజకీయం వద్దు

- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమని హామీ
- 2011 జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన
- ఢిల్లీకి డబ్బులు మోసుకెళ్లే సంస్కృతి కాంగ్రెస్‌దేనని విమర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) మరియు మహిళా రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ అంశాలను రాజకీయం చేయ వద్దని ఆయన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి సూచించారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన హామీ ఇచ్చారు.

మిగతా 2లో..

## చర్లపల్లి ఘటనలో సంచలన మలుపు

### ఆస్తి వివాదమే కారణమా?






2లో

## దేశ రాజకీయ సమతుల్యతకు సవాల్‌గా

# నియోజకవర్గాల పెంపు




- జీఎస్‌డీపీ హైబ్రీడ్ మోడల్‌కు సీఎం రేవంత్ రెడ్డి బలమైన వాదన
- ఉత్తర-దక్షిణ అసమానతలు పెరగకుండా సమతుల్య విధానం అవసరం
- మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు, కానీ పెంపు ప్రక్రియ వేరు
- అఖిలపక్ష చర్చలు, నిపుణుల కమిటీతో సమగ్ర నిర్ణయం తీసుకోవాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలో నియోజకవర్గాల పెంపు, పునర్విభజన అంశం తీవ్ర చర్చకు దారి తీస్తున్న వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కీలకమైన విస్తృత దృష్టికోణంతో కూడిన ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల దేశీ యోత్పత్తి) ఆధారంగా హైబ్రీడ్ మోడల్‌ను అమలు చేయాలని సూచిస్తూ, ప్రస్తుత కేంద్ర ప్రతిపాదన దేశ సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలకు అదనంగా 50 శాతం సీట్లు పెంచాలనే ఆలోచనలో, కొత్తగా వచ్చే 272 స్థానాలను రెండు భాగాలుగా విభజించాలని సీఎం సూచించారు. అందులో 136 స్థానాలను ప్రస్తుత ప్రాతినిధ్యానికి అనుగుణంగా ప్రొరేటా పద్ధతిలో కేటాయించాలి. మిగిలిన 136 స్థానాలను దేశ ఆర్థికాభివృద్ధికి అత్యధికంగా తోడ్పడుతున్న రాష్ట్రాల జీఎస్‌డీపీ ప్రాతిపదికన కేటాయించాలి అని ప్రతిపాదించారు.

మిగతా 2లో..

## రైతుల సమస్యలపై హరీష్ రావు ఆగ్రహం

- కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి
- శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు నిలిచిపోయాయని విమర్శలు
- మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్

2లో





## సింగూరు ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీ పనుల పరిశీలన

- మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన
- వచ్చే 50 ఏళ్ల పాటు పటిష్టంగా ఉండేలా నిర్మాణ పనులు
- ఐలాండ్ అభివృద్ధి, వాటర్ స్పోర్ట్స్ ద్వారా పర్యాటక హబ్‌గా సింగూరు
- ఇంటిగ్రేటెడ్ స్కూల్, గురుకుల పాఠశాలల నిర్మాణ పనులపై సమీక్ష

2లో

## కమర్షియల్ ఎల్పీజీ సరఫరాపై నిఘా

- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం
- సకాలంలో డెలివరీ చేయకుంటే లైసెన్సులు రద్దు
- 70 శాతం కోటా పంపిణీపై పౌరసరఫరాల శాఖ నిరంతర పర్యవేక్షణ




**హైదరాబాద్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరంలో కమర్షియల్ ఎల్పీజీ (LPG) సిలిండర్ల సరఫరాను క్రమబద్ధీకరించేందుకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. గ్యాస్ సరఫరాలో జరుగుతున్న జాప్యం మరియు అక్రమ పద్ధతులపై పౌరసరఫ రాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపోల నుండి సరఫరా మెరుగుపడినప్పటికీ, వినియో గదారులకు చేరడంలో జరుగుతున్న ఆల స్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెటింగ్ మరియు గ్యాస్ మళ్లింపు వంటి చర్యలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని హోటళ్లు, పరిశ్రమలు మరియు ఇతర వాణిజ్య అవసరాల కోసం కేటాయించిన 70 శాతం కమర్షియల్ ఎల్పీజీ కోటాను పారదర్శకంగా పంపిణీ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. గత వినియోగ గణాంకాల ఆధారంగా ఈ కేటాయింపులు జరుగుతాయని, అదనపు స్టాక్ అందుబాటులో ఉంటే వెంటనే విడుదల చేయాలని సూచించారు.

మిగతా 2లో..

## ఖానాపూర్ మున్సిపాలిటీలో బీజేపీ విజయం

- రాజకీయ మార్పుకు సంకేతం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌కు ప్రజల మద్దతు
- డీలిమిటేషన్‌పై అపోహలు సృష్టిస్తున్నారంటూ విమర్శలు
- నూతన చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు



**ఖానాపూర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖానాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కీలక రాజకీయ మార్పుకు నిదర్శనంగా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభి వృద్ధి దిశగా రాష్ట్రం ముందుకు సాగాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు పట్ల ప్రజల్లో స్పష్టమైన ఆసక్తి కని పిస్తున్నదని ఆయన అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను గమ నించిన ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ విజయం భవిష్యత్తు రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. డీలిమిటేషన్ అంశంపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజల్లో అపోహలు, భయాలు సృష్టిస్తున్నారని రామచంద్రరా వు విమర్శించారు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

మిగతా 2లో..

## టీజీటెట్-2026 నోటిఫికేషన్ విడుదల

- జూన్ 15 నుంచి పరీక్షలు
- ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు
- సీబీటీ విధానంలో నిర్వహణ

**డెస్క్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ఉపాధ్యాయ వృత్తిని ఆశిస్తు న్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. టీజీటెట్ జూన్ 2026 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలను జూన్ 15 నుంచి జూన్ 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వ హించనున్నట్లు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖా స్తులు సమర్పించుకోవాలని అధికారులు తెలిపారు. టీజీటెట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ఉపాధ్యాయ నియామకా లకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ పరీక్షకు ప్రాధాన్యం పెరిగింది. డీఈడీ/ డీఎల్ఎడ్, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ లేదా సమాన కోర్సులు పూర్తి చేసిన వారు, అలాగే చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో టెట్ అర్హత సాధించిన వారు తమ స్కోర్ మెరుగుపరచుకునేందుకు మళ్లీ పరీక్ష రాయవచ్చు. పరీక్షను రెండు పేప ర్లుగా నిర్వహిస్తారు. 1 నుంచి 5వ తరగతి బోధన కోసం పేపర్I, 6 నుంచి 8వ తర గతులకు పేపర్II నిర్వహిస్తారు. రెండు స్థాయిలకు బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరుకావచ్చు. ఫీజులు జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ.750, రెండు పేపర్లకు రూ.1000గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఒక పేపర్‌కు రూ.700, రెండు పేపర్లకు రూ.950గా ఫీజు ఖరారు చేశారు. పరీక్షలకు సంబంధించిన ముఖ్యమైన తేదీలను కూడా విద్యాశాఖ ప్రకటించింది. ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు, జూన్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్, జూన్ 15 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు జూలై 28 నుంచి 31 మధ్య విడుదల కానున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సింగూరు ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీ పనుల పరిశీలన

**మెదక్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఆందోల్ నియోజకవర్గంలోని సింగూరు ప్రాజెక్టును రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సందర్శించారు. ప్రాజెక్టులో జరుగుతున్న డ్యామ్ సేఫ్టీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల మేరకు, సింగూరు ప్రాజెక్టు మరో 50 ఏళ్ల పాటు అత్యంత పటిష్టంగా నిలిచేలా నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పనుల వేగవంతానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను చర్చించిన ఆయన, ఈ పనులను శరవేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

సింగూరు ప్రాజెక్టును ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అంశంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టులోని ఐలాండ్ అభివృద్ధి, బోటింగ్, పార్కులు, గార్డెన్ బ్యూటిఫికేషన్ మరియు వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుపై ఇరిగేషన్ మరియు టూరిజం అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. పర్యాటకుల కోసం కాటేజీలు, రెస్టారెంట్ల నిర్మాణంపై చర్చించిన ఆయన, సిలారపు రాజనర్సింహ ప్రధాన కాలువ లైనింగ్ పనులను కూడా పరిశీలించారు. త్వరలో డ్యామ్ సేఫ్టీ మరియు పర్యాటక అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనంతరం మంత్రి ఆందోల్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఈ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఆందోల్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్ మరియు పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, స్థానిక ప్రాంతాల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెద్దారెడ్డి పేట లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిని కూడా ఆయన ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

సింగూరు ప్రాజెక్టు వద్ద ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి, అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు స్పోర్ట్స్ ఫెసిలిటీస్ కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

మంత్రి పర్యటనతో జిల్లాలోని వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ప్రాజెక్టుల నిర్వహణతో పాటు పర్యాటక రంగానికి పెద్దపీట వేయడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ మరియు టూరిజం శాఖల ఉన్నతాధికారులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని మంత్రి పునరుద్ఘాటించారు.

# రైతుల సమస్యలపై హరీష్ రావు ఆగ్రహం

**సంగారెడ్డి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి టి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కొనుగోళ్లు నిలిపివేయడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు కోటా పేరుతో నిలిపివేశారని హరీష్ రావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారుల పాలవుతున్నారని తెలిపారు. శనగలపై ఎకరానికి సుమారు రూ.10 వేల నష్టం వస్తోందని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని ఆయన అన్నారు. మక్కజొన్నకు మద్దతు ధర రూ.2400 ఉన్నప్పటికీ రైతులు రూ.1600-1700కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇంకా పెద్ద మొత్తంలో శనగలు రైతుల వద్దనే ఉన్నాయని, వెంటనే రూ.5870 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలస్యం అయితే రైతులు మరింత నష్టపోతారని హెచ్చరించారు. జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రైతులు తమ పంటలను పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లి తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వడ్ల కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయని అన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని హరీష్ రావు విమర్శించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, బోనస్ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# కమర్షియల్ ఎల్పీజీ సరఫరాపై నిఘా

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా గొలుసులో ఎక్కడా అంతరాయం కలగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అక్రమాలకు పాల్పడే ఏజెన్సీలు మరియు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. ముఖ్యంగా డెలివరీలో జాప్యం చేయడం ద్వారా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసే వారిపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తామన్నారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించడం ద్వారా సరఫరా వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకురావాలని భావిస్తున్నారు.

గ్యాస్ సరఫరా ప్రక్రియ సజావుగా సాగేందుకు భాగస్వాములందరూ సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. పంపిణీదారులు మరియు డీలర్లు నైతికంగా వ్యవహరించి, వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలని కోరారు. పౌరసరఫరాల శాఖ బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయని, ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు మరియు గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. అక్రమ మళ్లింపును అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకోవాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి సిలిండర్ ట్రాకింగ్ సులభమవుతుందని, అక్రమాలకు తావుండదని అధికారులు భావిస్తున్నారు. పారదర్శకమైన పంపిణీ వ్యవస్థ ద్వారా వాణిజ్య అవసరాలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.

# ఖానాపూర్ మున్సిపాలిటీలో బీజేపీ విజయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు నిజాలు తెలియజేయడం తమ బాధ్యతగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడంలో విఫలమైందని, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును విస్మరించిందని పేర్కొన్నారు. మహిళా సాధికారత పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని పూర్తి విశ్వాసంతో రామచంద్రరావు తెలిపారు. ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలపడుతుందని, రాబోయే ఎన్నికల్లో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తాయని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఖానాపూర్ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన అంకం మౌనికకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ రాజకీయ సమతుల్యతకు సవాల్‌గా

# నియోజకవర్గాల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఇలా చేస్తే జనాభా, ఆర్థికాభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల విషయంలో మాత్రం తమ ప్రభుత్వం పూర్తిగా మద్దతుగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ బిల్లును ఆలస్యం చేయకుండా అమలు చేయాలని, ఇప్పటికే 2023లో ఆమోదం పొందినప్పటికీ అమలు జరగకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పెంపుతో కలిపి ఒకే బిల్లుగా తీసుకురావడం రాజకీయంగా, రాజ్యాంగపరంగా సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.

జనాభా ఆధారంగా మాత్రమే నియోజకవర్గాల పెంపు చేస్తే, ఉత్తరాది రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభించి, దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వెనుకబడే ప్రమాదం ఉందని సీఎం విశ్లేషించారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు భారీగా లాభ



పడుతుండగా, తెలంగాణ, కేరళ వంటి రాష్ట్రాలు రాజకీయంగా బలహీనపడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఇది క్రమంగా దేశ రాజకీయ సమతుల్యతను దెబ్బతీసి, చిన్న రాష్ట్రాలను ద్వితీయ శ్రేణి స్థితికి నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ప్రధాన ఆర్థిక కేంద్రాలుగా నిలుస్తున్నాయని, ఆదాయం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం గుర్తుచేశారు. అలాంటి రాష్ట్రాలను జనాభా ఆధారంగా మాత్రమే కొలిచి ప్రాతినిధ్యం తగ్గించడం అన్యాయమని అన్నారు.

దేశ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్రాలకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకునే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీఎం డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు సేకరించి, శాసనసభల సూచనలు తీసుకుని, నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఆ నివేదికను పార్లమెంట్‌లో చర్చించి, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. 2028 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని, అప్పటి వరకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం అనవసర గందరగోళానికి దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంలో పారదర్శకత, సమగ్రత అవసరమని చెప్పారు.

దేశ రాజకీయ వ్యవస్థలో సమాన ప్రతినిధిత్వం, ప్రాంతీయ సమతుల్యత, ఆర్థిక న్యాయం అన్న మూడు అంశాలు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మూడు లక్ష్యాలను సాధించేలా జీఎస్‌డీపీ హైబ్రీడ్ మోడల్ ఉత్తమ మార్గమని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను గంభీరంగా పరిగణించాలన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ కీలక అంశంపై సమగ్ర చర్చ అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

# చర్లపల్లి ఘటనలో సంచలన మలుపు



- ఆస్తి వివాదమే కారణమా?
- అత్తమామలపై భర్త ఆరోపణలు
- పోలీసుల దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి వివాదం కారణంగానే ఈ దారుణం జరిగిందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17) చర్లపల్లి-ఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది.

తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆస్తి కోసం వారే తన భార్యను మానసికంగా వేధించారని, అదే ఆమెను ఈ దారుణ నిర్ణయం తీసుకునేలా చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. “నా భార్య, పిల్లలు పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే మోసం చేసి ఈ పరిస్థితికి తెచ్చారు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాపిల్లలు చనిపోయిన తర్వాత కూడా ఆస్తి కోసం తనను బెదిరిస్తున్నారని సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఇంట్లో ఉన్న సుమారు కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును అత్త గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనను కూడా లక్ష్యంగా చేసుకున్నారని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు.

తాను ఏదైనా ప్రమాదానికి గురైతే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని స్పష్టం చేశారు. తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క రూపాయి కూడా దక్కనివ్వనని తెలిపారు.

విజయశాంతి హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తుండగా, సురేందర్ రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఘటనకు ముందు రోజు పిల్లలను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డైంది.

భర్త ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో కేసును పునః పరిశీలిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో మరిన్ని సంచలన అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# డీలిమిటేషన్‌పై రాజకీయం వద్దు




(మొదటి పేజీ తరువాయి)

తాము కూడా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నామని, ఇక్కడి రాష్ట్రాల ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగనివ్వబోమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను వివరిస్తూ, ఇది 2011 జనాభా లెక్కల ప్రకారమే జరుగుతుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుందని, అంతవరకు వేచి చూడకుండా అనవసరంగా ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని కోరారు. రాజ్యాంగబద్ధంగా జరిగే ఈ ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'చప్రాసీ' వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కిషన్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది వారికి చప్రాసీ పదవి కూడా రాదన్న రేవంత్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి కావాలన్నా ఢిల్లీకి డబ్బులు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని, కానీ భారతీయ జనతా పార్టీలో అటువంటి సంస్కృతి లేదని ఆయన ధ్వజమెత్తారు. దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులుగా తాము దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. పదవుల కోసం పాకులాడే చరిత్ర తమది కాదని, ప్రజల ఆశీస్సులతోనే బాధ్యతలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి నిత్యం ఢిల్లీ చుట్టూ తిరగడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన విమర్శించారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

ఈ సమావేశంలో కిషన్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. దేశ సమగ్రతను దెబ్బతీసే విధంగా ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టవద్దని కాంగ్రెస్ నేతలను కోరారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల అన్ని రాష్ట్రాలకు న్యాయమైన ప్రాతినిధ్యం లభిస్తుందని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉంటుందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతామని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. దీనిపై త్వరలోనే మరింత స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# చెరువుల్లో గుర్రపు డెక్కతో దోమల సమస్య తీవ్రం

- జోనల్ కమిషనర్‌కు సాయిజెన్ వినతి
- పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశాలు

**నాచారం, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు, పటేల్ కుంట చెరువుల్లో విపరీతంగా గుర్రపు డెక్క (వాటర్ హైసింత్) పెరగడంతో దోమల సమస్య తీవ్రమైంది. ఇప్పటికే గుర్రపు డెక్క తొలగింపు పనులకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరై రెండు నెలలు గడిచినా, పనులు ప్రారంభం కాలేదని బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.అధికారుల నిర్లక్ష్యం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని ఆయన ఆరోపిస్తూ, తక్షణమే గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కమలానగర్‌లోకుల నిర్మూలన సాంస్కృతోత్సవాలు

- పాటల పోటీల ద్వారా సమానత్వ సందేశం

**ఏ ఎస్ రావు నగర్ , ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతుల సందర్భంగా కుల నిర్మూలన సాంస్కృతోత్సవాల భాగంగా సోమవారం కమలానగర్ ఆఫీసు ఆవరణలో "కుల నిర్మూలన" అంశంపై పాటల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రారంభంగా గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతాన్ని బొమ్మగాని రుక్కయ్య ఆలపించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే మరణానికి సంతాప సూచకంగా కొద్దిసేపు మౌనం పాటించారు.ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ, కుల వ్యవస్థ శతాబ్దాలుగా సమాజాన్ని విభజించి శ్రామిక వర్గాలను బానిసలుగా మార్చిందని అన్నారు.కుల వివక్షను పూర్తిగా నిర్మూలించనంత కాలం దేశం పురోగమించదని, సమానత్వ సమాజం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, కులం భూస్వామ్య సమాజపు దుష్ట వ్యవస్థగా నిలిచి అసమానతలకు కారణమైందని తెలిపారు. దానిని అంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అమ్మ ఫౌండేషన్ బాధ్యుడు గంజి ఈశ్వర లింగం మాట్లాడుతూ, మరణానంతరం అవయవ దానం, నేత్రదానం వంటి సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని వివరించారు.పాటల పోటీల్లో బొమ్మగాని సోమయ్య, పాండు, కోటేశ్వరరావు, నరసింహారావు, రుక్కయ్య, సిహెచ్ లీలావతి, దువా కిరటి, నవతెలంగాణ రవి, షణ్ముఖం, ఎం భాస్కర్ రావు తదితరులు కుల వివక్షపై పాటలు, పద్యాలు, కవితలు వినిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.ఉదయ్ కుమార్ సందేశం ఇచ్చారు.ముగింపులో పాల్గొన్న కళాకారులకు చేనేత కండువాలతో పాటు రామిశెట్టి రోశయ్య రచించిన "నాదే కులం", "ప్రపంచీకరణ" పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.స్ఫూర్తి గ్రూప్ యువ నాయకుడు గిరీష్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాజీ ఉప సర్పంచ్ వీరబాబు మాతృమూర్తికి ఘన నివాళి

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలం చిన్న మడవ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పర్సగాని వీరబాబు మాతృమూర్తి సత్యవతి అమ్మ దశదిన కర్మ సోమవారం ఘనంగా జరిగింది. ఇటీవల మరణించిన పర్సగాని సత్యవతి కి నివాళులర్పించేందుకు మండల మరియు గ్రామ స్థాయి నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీకి చెందిన మండల మరియు గ్రామ స్థాయి నాయకులు పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యవతి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మంత్రి తుమ్మలతో అశ్వరావుపేట ప్రజాప్రతినిధుల భేటీ

**దమ్మపేట, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**



మండలంలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ నాయకత్వంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల వారికి అభినందనలు తెలియజేస్తూ శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అశ్వరావుపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతంగా ఉన్న అశ్వరావుపేటకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా ప్రజాభిమానాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చూడాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ పారదర్శకతతో ముందుకు సాగాలని, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాహమే తీర్చని చలివేంద్రం

- మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం పై ప్రజల ఆగ్రహం
- ఓపెనింగ్ ఫోటోలకే పరిమితమైన చలివేంద్రం
- పేరుకే చలివేంద్రం ఆ కుండలో నీటిని నింపని నిర్వాకులు

**స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** వేసవి ఎండలు తీవ్రంగా మండుతున్న ఈ సమయంలో ప్రజల దాహం తీర్చాల్సిన చలివేంద్రాలు... నిర్లక్ష్యానికి గురై ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలోని శివునిపల్లి గాంధీ సెంటర్ వద్ద, బరోడా బ్యాంక్ ముందు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రస్తుతం పూర్తిగా పనికిరాని స్థితికి చేరింది. రోజూ వందలాది మంది ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు రాకపోకలు సాగించే ఈ ప్రదేశంలో తాగునీరు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. దాహం తీర్చుకోవాలనే ఆశతో చలివేంద్రం వద్దకు వచ్చిన వారికి ఎదురవుతున్నది మాత్రం ఖాళీ కుండలు, పగిలిన పాత్రలు మాత్రమే.

ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, నీటిని నింపకపోవడం, కుండలను సరిచేయకపోవడం మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనంగా మారింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, రోజువారీ కూలీలు ఈ చలివేంద్రంపై ఆధారపడుతుండగా, వారికి నీరు అందకపోవడం వారి ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది.

ఇక బయట తాగునీరు కొనాలంటే ఒక్క బాటిల్‌కే రూ.20 ఖర్చు అవుతుంది. రోజువారీ కూలీలు, నిరుపేదలు అలాంటి ఖర్చు భరించలేని పరిస్థితి. "చలివేంద్రం ఉంది కదా" అనే నమ్మకంతో అక్కడికి వస్తే... నీరు లేకుండా వట్టి కుండలే కనిపించడం ప్రజలను మరింత నిరాశకు గురిచేస్తోంది.

**ప్రజల ప్రశ్నలు – సమాధానం ఎక్కడ?**

చలివేంద్రం ఏర్పాటు చేసి వదిలేయడమేనా?




రోజూ నీళ్లు నింపే బాధ్యత ఎవరిది?
పర్యవేక్షణ ఎందుకు లేదు?
అనే ప్రశ్నలు స్థానిక ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయి.

**పేరుకు మాత్రమే చలివేంద్రం – ఫోటోలకే పరిమితం:**

ప్రస్తుతం ఈ చలివేంద్రం కేవలం ఫోటోలకే పరిమితమైందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా, కేవలం ప్రదర్శన కోసం ఏర్పాటు చేసినట్టుగా పరిస్థితి కనిపిస్తోంది.

**తక్షణ చర్యలు అవసరం:**

వేసవి తీవ్రత దృష్ట్యా వెంటనే చలివేంద్రాన్ని పునరుద్ధరించి, ప్రతిరోజూ శుభ్రమైన



తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యత వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని, ఇలాంటి నిర్లక్ష్యం మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఇంకా స్పందించకపోతే...**

ప్రజల ప్రాణాలకు సంబంధం ఉన్న ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే, ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ మేల్కొని, ప్రజల దాహం తీర్చే విధంగా చలివేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

- వలస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,ఏప్రిల్13(తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ..రక్తదాతలు ప్రాణదాతలు అని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని, ఇది ఒకరి ప్రాణాన్ని కాపాడటంతో సమానం అని తెలిపారు.అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చెప్పారు.ఈ శిబిరంలో బండారు శ్రీనివాస్ 19వ సారి రక్తదానం చేయడం విశేషం కాగా, రమేష్, వెంకటేష్‌లను శంకర్ గౌడ్ అభినందించారు.కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి ప్రొఫెసర్ అరుణకుమారి, సీనియర్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ అవెంజలిన్, ఉద్యోగులు సంతోష్, లక్ష్మి, పద్మ, సులోచన (గ్రేడ్2 నర్సింగ్ సూపరింటెండెంట్) తదితరులు పాల్గొన్నారు.




# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సాగిన కేసీఆర్ పదేళ్ల పాలన
- మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు )**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో అంబేద్కర్ స్ఫూర్తి కీలకమని పేర్కొంటూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం, అలాగే హైదరాబాద్‌లో 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆచరణలో చూపించిందని చెప్పారు. రైతులకు రైతుబంధు, దళిత, బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు వివరించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి దళిత వర్గాల ఆర్థిక పురోగతికి దోహదపడిందని తెలియజేశారు. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ హాయంలోనే అత్యధిక సంఖ్యలో గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, దళిత బహుజన పిల్లలకు ఉచిత విద్యను అందించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని కేసీఆర్ ఆదేశాల మేరకు 17వ లోక్‌సభలో తన వంతు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు వెల్లడించారు.



# అరైవ్ అలైవ్ కార్యక్రమంలో రోడ్డు గుంతల పూడ్చివేత

- జిహెచ్ఎంసి–జవహర్ నగర్ పోలీసుల సంయుక్త చర్యలు,
- ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**జవహర్ నగర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం 4వ దశలో భాగంగా జవహర్ నగర్ చెన్నాపురం సమీప ప్రాంతాల్లో రోడ్డు గుంతల పూడ్చివేత చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిహెచ్ఎంసి మరియు జవహర్ నగర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను గుర్తించి వెంటనే పూడ్చివేయడం ద్వారా వాహనదారులకు సౌకర్యం కల్పించడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.





ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులను పాటించడం వంటి అంశాలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదులు, అడ్మిన్ ఎస్సై రాము నాయక్, జిహెచ్ఎంసి సిబ్బంది సందీప్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే కాలనీ నివాసులు బిరు ఏక స్వామి, సరిత, సుప్రియ తదితరులు హాజరై కార్యక్రమానికి సహకరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్యుత్ కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలి

- **పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్**




**భీమదేవరపల్లి, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ఆధ్వర్యంలో గత 6 రోజులుగా కొనసాగుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెకు బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ పూర్తి మద్దతూ తెలియజేస్తున్నరు.

కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల సమస్యలు. నాటి బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయి. ప్రమాదకరమైన విధులు నిర్వర్తిస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఎలాంటి హామీలు లేవు. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క గారు పాదయాత్ర సమయంలో అధికారంలోకి వస్తే విద్యుత్ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరిస్తామని మీడియా సాక్షిగా హామీ ఇచ్చారు. నేడు అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించి తుంగలో తొక్కుతున్నారు. సచివాలయల ముందు విగ్రహాలు, ఫుట్ బాల్ టోర్నీల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రాణాలను పణంగా పెట్టి 24 గంటలు ప్రజలకు సేవ చేస్తున్న విద్యుత్ కార్మికులకు మాత్రం న్యాయం చేయడం లేదు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయడం, సమాన పనికి సమాన వేతనం, ప్రమాద బీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం, కార్మిక చట్టాలు అమలు చేయడం.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటుంటే, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మేమే చేశాం అని గొప్పలు చెప్పుకుంటూ కార్మికులను మోసం చేస్తోంది. కావున, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిజెపి డిమాండ్ చేస్తోంది. కార్మికుల పోరాటానికి బిజెపి అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాం.

# మార్కుల నిరుత్సాహంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

- **ఏఎస్‌రావు నగర్ నుంచి కాచిగూడ వరకు ట్రేస్**
- **మిస్సింగ్ కేసు నమోదు**



**జవహర్ నగర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్ జై జవాన్ కాలనీకి చెందిన చల్ల బాలాజీ (17) అనే ఇంటర్మీడియట్ విద్యార్థి ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.పోలీసులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 12 సాయంత్రం 7 గంటల సమయంలో బాలాజీ ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడు. అనంతరం రాత్రి 8 గంటల సమయంలో డా .ఏ ఎస్ రావు నగర్ బస్ స్టాప్ వద్ద అతను కనిపించినట్లు పొరుగువారు తెలిపారు.ఇంటర్మీడియట్ పరీక్షల్లో 400కు పైగా మార్కులు వస్తాయని ఆశించిన బాలాజీకి సుమారు 300 మార్కులు రావడంతో తీవ్ర నిరుత్సాహానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తల్లి చెల్లా సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 13 ఉదయం 8 గంటలకు 7383680566 నంబర్ నుండి తన తల్లి కాల్ చేసి ఇంటికి రావాలని చెప్పినప్పటికీ బాలాజీ తిరస్కరించి కాల్ కట్ చేసినట్లు సమాచారం. తిరిగి సంప్రదించగా తాను కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఉన్నట్లు తెలిసింది.తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలాజీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.




# జమ్మికుంటలో అంబేద్కర్ జయంతి వేడుకలకు ఘన సన్నాహాలు

**జమ్మికుంట టోన్ ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జమ్మికుంట పట్టణం వేడుకల కాంతులతో కళకళలాడనుంది. వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రేపు (14042026) ఉదయం 10:00 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, పాలకవర్గ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు.

అనంతరం సాయంత్రం 5:00 నుంచి 8:00 గంటల వరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడైన అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణం ఉత్సవ వాతావరణంలో మునిగిపోనుంది.

# ప్లేస్మెంట్‌లో మెరిసిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

- **క్యాంపస్ డ్రైవ్‌లో 88 మందికి అవకాశం.**

**సత్తుపల్లి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**







మండల పరిధిలోని బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో "ప్లేస్మెంట్ సక్సెస్ మీట్-2026" కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు నాలుగేళ్ల కష్టానికి ఫలితంగా మంచి ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని సూచించారు. సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కొత్త టెక్నాలజీలను నేర్చుకుని ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిలషించారు. ట్రైనింగ్ & ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.ఎన్.వి. కృష్ణారెడ్డి వివరాల ప్రకారం, ఈ సంవత్సరం మొత్తం 88 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. పరీక్షలు పూర్తయ్యాక వారు ఉద్యోగాల్లో చేరనున్నారు. క్యాంపస్ రిక్రూట్మెంట్‌లో ఎంపికైన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాలతో సత్కరించడం జరిగింది. తమ మొదటి ఉద్యోగంపై విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **రవికుమార్ టిఆర్పి జిల్లా యూత్ అధ్యక్షులు**

**వనపర్తి,ఏప్రిల్13(తెలంగాణ ముచ్చట్లు):**




విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ డిమాండ్ చేశారు.వనపర్తి జిల్లా విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో టీజీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ముందు జరుగుతున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలుపుతూ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని విమర్శించారు.జీవో 11ను అమలు చేసి విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్లను ఉద్యోగులుగా మార్చాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు.రాష్ట్రంలో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ వారికి న్యాయం జరగడం లేదన్నారు. కార్మికులు తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యేక పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోకు, తిరుపతయ్య, నరేష్, జగదీష్, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఆదర్శలో పది విద్యార్థులకు ఘన వీడ్కోలు

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు )**




చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం జరిగింది. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ సూచించారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ , అకుంఠిత దీక్ష, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగినప్పుడు అనుకున్న గమ్యాన్ని చేరుతారని ఆయన తెలిపారు. విద్యార్థులు పాఠశాల తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు . ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోళ్ల రేణుక, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పందిరి పుల్లారావు, సుధాకర్, ప్రశాంతి, పార్వతి, సుజాత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి - సురక్షితంగా ప్రయాణించండి

**భీమదేవరపల్లి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**







ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రోడ్డు భద్రత పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముల్కనూర్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో తలకు గాయాలు తీవ్రంగా తగ్గుతాయని, ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు.

గ్రామ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గొల్లపల్లి గ్రామంలో ప్రత్యేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత, గ్రామస్తులు హెల్మెట్‌లు ధరించి ఈ ర్యాలీలో పాల్గొని "హెల్మెట్ ధరించండి - ప్రాణాలను కాపాడుకోండి" అనే నినాదాలను వినిపించారు.

అలాగే హెల్మెట్ లేని వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చర్యతో గ్రామస్తులు పోలీసుల పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు భద్రతపై తమ బాధ్యతను చాటుకున్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం కలిగించి ప్రమాదాల సంఖ్యను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.

"హెల్మెట్ ఒక చిన్న అలవాటు... కానీ అది ప్రాణాలను కాపాడే పెద్ద రక్షణ" అని పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు.







# రోడ్డు భద్రత – ప్రతి ఒక్కరి బాధ్యత

- **ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.**
- **డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ.**

**సత్తుపల్లి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో నిర్వహించిన "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ఎంవీఐ రాజశేఖర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ జి అశోక్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ, సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీలో శిక్షణ పొందిన డ్రైవర్లు ఉండటం వల్ల ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదమని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడానికి ర్యాలీ నిర్వహించారు. వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిపో నుంచి రింగ్ సెంటర్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం డిపో గేటు వద్ద ఉద్యోగులతో కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి అశోక్, ఎంవీఐ రాజశేఖర్, ఏఎంవీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, ఏడీసీలు, సూపర్‌వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణిలో తాగునీరు, డ్రైనేజ్ సమస్యలపై కాంగ్రెస్ వినతి

- ఉప్పల్ వాటర్ వర్క్స అధికారులతో చర్చ
- కాలనీల సమస్యల త్వరిత పరిష్కారానికి హామీ

**మల్లాపూర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజావాణి కార్యక్రమంలో ఉప్పల్ వాటర్ వర్క్స జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం వేణుగోపాల్, మల్లాపూర్ ఏఈ రోహిత్‌లతో కలిసి కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మరియు వారి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతంలో నెలకొన్న తాగునీటి మరియు డ్రైనేజ్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు ."బస్తీబాట" కార్యక్రమంలో ప్రజలు వ్యక్తపరిచిన సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా కే.ఎల్. రెడ్డి, హెచ్‌సిఎల్ కాలనీ, అన్నపూర్ణ, భవాని నగర్ కాలనీలలో తక్కువ ప్రెషర్‌తో తాగునీటి సరఫరా జరుగుతుండటం, ఓల్డ్ మల్లాపూర్‌లో మదీనా చికెన్ సెంటర్ ఎదురుగా కొత్త వాటర్ లైన్ మరియు కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం, పలు కాలనీలలో డ్రైనేజ్ లైన్ల ఏర్పాటు వంటి సమస్యలను ప్రస్తావించారు. ఈ సమస్యలపై స్పందించిన జీఎం సంతోష్ కుమార్ వాటిని అత్యవసరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నెమలి అనిల్ కుమార్ కృషిని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కోయలకొండ రాజేష్, శంకర్ గౌడ్, పిడిశెట్టి సురేష్, అన్వర్ పఠాన్, సాయి కుమార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకు బంగారం అంటూ మోసం ప్రయత్నం

- నాగారం మాజీ వార్డ్ సభ్యుడు సాయినాథ్ గౌడ్‌కు ఫోన్ కాల్
- అప్రమత్తం చేసిన పోలీసులకు సమాచారం



**నాగారం, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం డివిజన్‌లో తక్కువ ధరకే బంగారం అందిస్తామని చెప్పి మోసం చేయడానికి ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో నాగారం మాజీ వార్డ్ సభ్యుడు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్‌ను లక్ష్యంగా చేసుకుని అగంతకులు ఫోన్ కాల్ చేశారు. సోమవారం సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో 9581689660 నంబర్ నుండి ఫోన్ చేసి తక్కువ ధరలో బంగారం ఇస్తామని నమ్మబలికే ప్రయత్నం చేశారు.అంతే కాకుండా 9676470306 వాట్సాప్ నంబర్ ద్వారా బంగారం ఉన్నట్లు చూపిస్తూ వీడియోను పంపించారు.అయితే ఈ వ్యవహారం అనుమానాస్పదంగా భావించిన సాయినాథ్ గౌడ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే అగంతకుల కాల్ రికార్డులు, వీడియోలను పత్రికలు మరియు ప్రసార మాధ్యమాలకు పంపించి ప్రజలను అప్రమత్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ ధరలకు బంగారం, లోన్లు, లాటరీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.కష్టపడి సంపాదించిన డబ్బును రక్షించుకోవాలంటే అపరిచితుల మాటలకు లోబడకూడదని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సాయినాథ్ గౌడ్ ప్రజలను కోరారు.

# ఎన్‌ఎఫ్‌సి ఆర్ఓబి విస్తరణకు సిపిఎం వినతి

- ట్రాఫిక్ రద్దీతో ప్రజలకు ఇబ్బందులు
- వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని వినతి



**నాచారం, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి)ను విస్తరించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మల్కాజ్‌గిరి మహానగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు, సర్కిల్ కమిటీ సభ్యులు పి. గణేష్, సఫియా మాట్లాడుతూ చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం తర్వాత ఈ మార్గంలో వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.నాచారం, మల్లాపూర్, మౌలాలి, కుషాయిగూడ, చర్లపల్లి ప్రాంతాలతో పాటు సమీప పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే వేలాది మంది ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారని తెలిపారు. బ్రిడ్జి ఇరుకుగా ఉండటం, భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ట్రాఫిక్ రద్దీ కారణంగా అంబులెన్స్ వంటి అత్యవసర సేవలు కూడా సకాలంలో చేరలేకపోతున్నాయని తెలిపారు. కాబట్టి ఎన్‌ఎఫ్‌సి ఆర్‌ఓబి విస్తరణకు తక్షణమే నిధులు మంజూరు చేసి, రైల్వే శాఖతో సమన్వయం చేస్తూ పనులు ప్రారంభించాలని సిపిఎం నాయకులు కమిషనర్‌ను కోరారు.

# రబీ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు పూర్తి

- ఏప్రిల్ 25 నుంచి 15 కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- 48 గంటల్లో రైతులకు చెల్లింపులు







**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పౌరసరఫరాల కార్యాలయం లో అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి అధ్యక్షతన రబీ 202526 సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోఆపరేటివ్ అధికారి నాగలింగా చారి, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్‌తో పాటు కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 25 నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొనుగోళ్లకు అవసరమైన గన్నీలు తగినంతగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. రైతులు తమ వడ్లను తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరచి, బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. వరికోత సమయంలో యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం సకాలంలో కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యమవకుండా అదే రోజు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నిరంతర సమీక్ష నిర్వహించాలని, రైతులు తమ ధాన్యం అమ్మిన 48 గంటలలోపే వారి ఖాతాల్లో నేరుగా చెల్లింపులు జమ అవుతాయని తెలిపారు. చివరి గా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# అలియాబాద్‌లో "అరైవ్-అలైవ్" కార్యక్రమం ప్రారంభం

- పౌర చైతన్యం, బాధ్యతాయుత ప్రవర్తనకు ప్రాధాన్యం
- ప్రజల భాగస్వామ్యం అవసరం



**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** పౌర చైతన్యాన్ని పెంపొందించడం, మున్సిపల్ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో "అరైవ్అలైవ్" కార్యక్రమాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, డిటిఓ మేడ్చల్, డిఈఈ (ఆర్&బి), శామీర్‌పేట్ సీఐ (లా & ఆర్డర్), మేడ్చల్ ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడిన అధికారులు, ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన పౌర ప్రవర్తనను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం కీలకమని తెలిపారు. మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే కార్యక్రమం విజయవంతమవుతుందని అభిప్రాయపడ్డారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, సురక్షితమైన మరియు సమాచారవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలని సూచించారు. "అరైవ్‌అలైవ్" కార్యక్రమంలో అలియాబాద్ ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గొర్రెల కాపరుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

- నాగేంద్ర యాదవ్





**మహబూబ్‌నగర్ ,ఏప్రిల్13(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ప్రభుత్వాన్ని గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.నాయకులు మాట్లాడుతూ గొర్రెలకు బీమా సదుపాయం కల్పించడం, ఎన్‌సీడీసీ రుణాలను మాఫీ చేయడం, రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయడం వంటి డిమాండ్లను ముందుకు తెచ్చారు. ప్రతి మండలంలో గొర్రెల-మేకల మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయడం, పశువైద్య సబ్ సెంటర్లను బలోపేతం చేసి సిబ్బందిని నియమించడం అవసరమని పేర్కొన్నారు.భూమిలేని గొర్రెల కాపరులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో 50% సబ్సిడీపై పశువులను అందించాలని, ఎన్‌ఎల్‌ఎం పథకంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతయ్య యాదవ్, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహ యాదవ్, నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు వెంటనే పరిష్కారం కల్పించాలి

- మేడ్చల్–మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు
- 181 ఫిర్యాదులు స్వీకరణ
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచన





**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జెడ్పీ సీఈవో కాంతమ్మతో కలిసి మొత్తం 181 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి అధికారిపై బాధ్యతగా ఉందన్నారు. అందువల్ల అర్జీల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని, స్వీకరించిన ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ లేకుంటే ప్రవేశం లేదు

సీఐ వేణు









**స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని మీదికొండ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వేణు గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు.

"హెల్మెట్ లేకుంటే గ్రామములోనికి ప్రవేశం లేదు" అనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రజల ప్రాణ భద్రత కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టం తగ్గుతుందని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. యువత వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం చేయకూడదని తెలిపారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. గ్రామస్తులు పోలీస్ శాఖతో సహకరించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై వినయ్ కుమార్ సర్పంచ్ జోగు సంపత్ కుమార్, ఉప సర్పంచ్ ఆలకుంట్ల శ్రీనివాస్, పదో వార్డు సభ్యురాలు పొన్నం పారిజాతం, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పేదరికాన్ని జయించిన ప్రతిభ.. 976 మార్కులతో లక్ష్య మెరుపు!

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట 24వ వార్డుకు చెందిన గుంతక్ లక్ష్య ఇంటర్మీడియట్ పరీక్షల్లో 976 మార్కులు సాధించి ప్రతిభను చాటుకుంది. సాధారణ కుటుంబ పరిస్థితుల్లోనూ అంకితభావంతో చదువుతూ ఈ ఘనత సాధించడం అందరి ప్రశంసలను అందుకుంటోంది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాజేష్ ఠాగూర్, పట్టణ కార్యదర్శి రాకేష్ ఠాగూర్ కలిసి లక్ష్యను ప్రత్యేకంగా కలిసి అభినందించారు. పేదరికాన్ని అడ్డంకిగా భావించకుండా కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించినందుకు ఆమెను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

లక్ష్య తల్లిదండ్రులు గుంతక్ రమేష్, స్వప్న కూడా తమ కుమార్తె సాధనపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోతే స్వామి, గర్రెపల్లి నిరూపారాణి, కనుమల్ల లక్ష్మి, ఎండి సర్వర్, సది తదితరులు పాల్గొని విద్యార్థినిపై ప్రశంసల వర్షం కురిపించారు. కష్టపడితే సాధ్యం కానిదేమీ లేదని లక్ష్య విజయగాథ మరోసారి నిరూపించింది.




# పాపక్కపల్లిలో రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ.. ప్రజల్లో చైతన్యం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాపక్కపల్లి గ్రామంలో రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాజనవేణి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ నరేందర్ రెడ్డి, వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రోడ్ భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, ప్రమాదాలు నివారించడంలో అవగాహన కీలకమని తెలిపారు. అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు.

గ్రామ సభ నిర్వహించి రోడ్ సేఫ్టీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్ సేఫ్టీ నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు.

తరువాత "హెల్మెట్ ధరించి వాహనం నడపండి", "అతివేగం వద్దు - జీవితం ముద్దు", "మద్యం సేవించి వాహనం నడపొద్దు", "సీట్ బెల్ట్ ధరించి ప్రాణాన్ని రక్షించుకోండి" వంటి నినాదాలతో గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుట్ట కొక్కుల రాజు, వార్డు సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామైక్య సంఘ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు స్పందించండి గ్రామంలో అధికార దుర్వినియోగం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లె గ్రామంలో అధికార దుర్వినియోగం జరుగుతుందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మహిళా సర్పంచ్ బొంకూరి రజిత స్థానంలో ఆమె భర్త, ప్రభుత్వ ఉద్యోగి బొంకూరి రవీందర్ జోక్యం చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల సమాచారం ప్రకారం, రవీందర్ తరచూ సెలవులు తీసుకొని, కొన్నిసార్లు ఎటువంటి అధికార అనుమతి లేకుండానే గ్రామపంచాయతీ కార్యక్రమాల్లో పాల్గొంటూ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. సర్పంచ్ స్థానంలోనే వ్యవహరిస్తూ గ్రామపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




అదే విధంగా ఆదివారాలు వంటి సెలవు రోజుల్లో కూడా గ్రామానికి సంబంధించిన విషయాల్లో నేరుగా జోక్యం చేసుకుని ప్రైవేట్ పంచాయతీలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ చర్యల వల్ల గ్రామంలో పరిపాలనా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోందని వారు అంటున్నారు.

ఇంకా కొన్ని అభివృద్ధి పనుల్లో కూడా అధికారిక విధానాలను పక్కనబెట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని, గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెన్షన్ విధించాలని వారు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకత, నిష్పాక్షికత కాపాడేందుకు కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు






# రోడ్డు భద్రత, సురక్షితమైనా ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

- **పోలీస్ కమిషనర్ సునీల్ దాత్**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు )**

రోడ్డు భద్రత, సురక్షితమైనా ప్రయాణం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజలను సమాయత్వం చేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ విభాగాలు చెందిన అధికారులు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్‌టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. భారీ వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు ఎడమ వైపున, మిగిలినవి కుడి వైపున నడపాలన్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయరాదన్నారు. పార్కింగ్ లైట్లు లేకుండా పార్కింగ్ చేయరాదన్నారు. వాహనాలపై రేడియస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షితంగా ఉండటం చాల కీలకమని పేర్కొన్నారు. సురక్షితంగా రోడ్డు దాటడం కోసం పాఠశాలలు, పార్కుల దగ్గర రోడ్లపై "నెమ్మదిగా నడపండి" అనే సైన్ బోర్డులను గమనించాలని సూచించారు.

కార్యక్రమంలో రూరల్ ఇన్స్పెక్టర్ రాజు, విద్యుత్ శాఖ (ఏఈ) కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి కార్పొరేషన్‌కు శాశ్వత భవనం నిర్మాణం

- **రూ. 98 కోట్లకు ప్రభుత్వ అనుమతి**
- **ఉప్పల్‌లో 10 ఎకరాల్లో ఆధునిక కార్యాలయం**
- **పౌరసేవలు మరింత సమర్థవంతం:**
- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 98 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ భాగయాత్ లేఅవుట్ ఫేజ్ IIIలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ కార్యాలయం ద్వారా మున్సిపల్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మరియు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ అభివృద్ధి కోసం మరిన్ని ప్రాజెక్టులు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# రోడ్డుపై రక్షణకు హెల్మెట్ ఒక్కటే ఆయుధం

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**ఎల్కతుర్తి ,ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు):**





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు కోలాట బృందంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, గ్రామ సర్పంచ్ రజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల ప్రాణ భద్రత అని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. గ్రామంలో హెల్మెట్ వినియోగం పెరుగుతుండటం శుభపరిణామమని, మిగతా వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

డీసీపీ దార కవిత మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై గ్రామస్థుల్లో అవగాహన పెరగడం సంతోషకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామ పంచాయతీ తీసుకున్న హెల్మెట్ తప్పనిసరి నిర్ణయం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

కాజీపేట ఏసీపీ ఫింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రయాణం సురక్షితంగా పూర్తవ్వాలని, ఇతరులకు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో హెల్మెట్ లేని వారిని అనుమతించకూడదన్న తీర్మానం అభినందనీయం అని పేర్కొన్నారు. అదనంగా, కార్యక్రమంలో భాగంగా కొంతమంది వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగింది. యువతతో కలిసి ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించి, సురక్షిత ప్రయాణంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ పులి రమేష్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్టు సమస్యలపై బార్ అసోసియేషన్ వినతి

- **పోర్ట్‌ఫోలియో జడ్జి కె. లక్ష్మణ్‌ను కలిసిన మల్కాజ్‌గిరి బార్ ప్రతినిధులు**
- **పలు అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి**

**మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ పోర్ట్‌ఫోలియో జడ్జి కె. లక్ష్మణ్‌ను కలిసి కోర్టులకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై వినతిపత్రాలను సమర్పించారు.కుషాయిగూడ కోర్టులో జవహర్‌నగర్, ఆల్వాల్ పోలీస్ స్టేషన్లను కేటాయించాలని, కోర్టు అవసరాల నిమిత్తం రెండు ఎకరాల భూమి మార్పిడి చేపట్టాలని కోరారు. అలాగే, కుషాయిగూడ కోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను త్వరిత గతిన భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక నేరెడ్‌మెట్‌లో నిర్మాణంలో ఉన్న కొత్త కోర్టు భవన పనులను వేగవంతం చేయాలని కూడా డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జడ్జి కె. లక్ష్మణ్ ప్రతినిధుల వినతులను ఓపికగా విని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# కార్మిక వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయం


- **భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు స్వామి, మహేందర్**

**హన్మకొండ, ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):**

కార్మిక వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు నల్ల స్వామి, గిన్నరపు మహేందర్ పేర్కొన్నారు. కార్మిక వర్గాల హక్కుల సాధనలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి అపారమని వారు తెలిపారు. అణగారిన వర్గాలతో పాటు కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన చేపట్టిన సంస్కరణలు దేశానికి దిశానిర్దేశంగా నిలిచాయని వెల్లడించారు.

రోజుకు 12 గంటల పని విధానాన్ని 8 గంటలకు పరిమితం చేయించడం ద్వారా కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించే మార్గాన్ని అంబేద్కర్ సృష్టించారని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, సురక్షిత పనివాతావరణం, సామాజిక భద్రత కల్పించేందుకు ఆయన రూపొందించిన చట్టాలు నేటికీ మార్గదర్శకంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనలో ఆయన పోరాటం కార్మిక చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని వివరించారు.

రాజ్యాంగ రూపకల్పన ద్వారా సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణకు అంబేద్కర్ బలమైన పునాది వేశారని నాయకులు అన్నారు. కార్మిక వర్గాల పురోగతికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం సమాజానికి అవసరమని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల తరపున అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.





## పాత టౌన్ హాలు వినియోగంపై కలెక్టర్‌కు వినతి

**వనపర్తి,ఏప్రిల్13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి టౌన్‌లోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న టౌన్ హాలను ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు మరియు ప్రజల అవసరాలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి కి ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.ఈ వినతి పత్రాన్ని వనపర్తి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాదారి భోజరాజు, ఉపాధ్యక్షులు మద్దెల కర్ణాకర్, కార్యదర్శి రమేష్ కలిసి అందజేశారు.వినతిపై కలెక్టర్ ఆదర్శ సురభి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## జీతాల పెంపుపై జేసీఎం భేటీ.. ఉద్యోగుల్లో ఉత్కంఠ




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల పెంపుపై కీలకమైన పరిణామం చోటుచేసుకోనుంది. నేడు జాయింట్ కన్సల్టేటివ్ మెకానిజం డ్రాఫ్టింగ్ కమిటీ సమావేశం జరుగుతుండగా, ఇందులో జీతాలు, పెన్షన్లు, అలవెన్సుల పెంపుకు సంబంధించిన తుది మెమోరాండం సిద్ధం చేయనున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కరువు భత్యాన్ని ప్రాథమిక వేతనంలో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు బలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిర్ణయం అమలైతే బేసిక్ వేతనంతో పాటు ఇతర భత్యాలు కూడా పెరిగి, ఉద్యోగుల చేతికి వచ్చే మొత్తం ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం కేంద్ర ఉద్యోగులు సుమారు 58 శాతం కరువు భత్యం పొందుతున్న నేపథ్యంలో, ఇది మరో 2 శాతం పెరిగి 60 శాతానికి చేరే అవకాశముందని సమాచారం. ఈ పెంపు అమలైతే జనవరి 1, 2026 నుంచి బకాయిలు కూడా చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కొత్త వేతన సంఘంలో జీతాల పెంపును నిర్ణయించే ఫిట్ మెంట్ ఫ్యాక్టర్ కనీసం 3.25గా ఉండాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. దీనిపై ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తే లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు పెద్ద ఎత్తున ఆర్థిక లాభం చేకూరనుంది.

ఈరోజు జరిగే సమావేశంలో ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు, కొత్త వేతన స్కేలు, అలాగే గతంలో వేతన సంఘం అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలపై కూడా చర్చించనున్నారు. ఈ సమావేశం అనంతరం సిద్ధమయ్యే నివేదిక ఆధారంగా ఎనిమిదవ వేతన సంఘం తుది సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది. దీంతో కోట్లాది మంది ఉద్యోగుల కుటుంబాల్లో ఆశలు పెరుగుతున్నాయి.




## జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం.. ర్యాలీతో అవగాహన

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 13 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలో 202627 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో జాతీయ స్థాయి అర్హతలు, పరిశోధన అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ఆధునిక బోధనా విధానాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. డే స్కాలర్స్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన సదుపాయం, అలాగే బాలురు, బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ సౌకర్యం అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలో చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం అడ్మిషన్లపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన..

- ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**పెద్దమందడి,ఏప్రిల్13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నిర్వీణ్ గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మోజర్ల కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న 7 రోజుల జాతీయ సేవా పథక (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా రైతులకు సేంద్రియ వ్యవసాయం, నేల మట్టి మరియు నీటి పరీక్షలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. గజానంద్ మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం ద్వారా భూమి సారం పెరుగుతుందని, వంటగది వ్యర్థాలను కంపోస్ట్‌గా వినియోగించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వర్మి కంపోస్ట్ వినియోగంతో రసాయనాలపై ఆధారపడకుండా, పెస్టిసైడ్ వినియోగం తగ్గుతుందని వివరించారు.విద్యార్థులు భార్గవ్, అనూష, అంజలి, సింధు తదితరులు సేంద్రియ వ్యవసాయం పద్ధతులు, నేల మట్టి మరియు నీటి నమూనాల సేకరణ విధానాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్. రామకృష్ణ, ఉప సర్పంచ్ పి. సుజాత ఆనంద్, పంచాయతీ సెక్రెటరీ పి. రామ్ చరణ్, భూసార పరీక్ష నిపుణుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్లపై అడ్డుగా వున్న చెట్లపొదలను తొలగించిన చింతకాని పోలీసులు

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 13(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని వైరా సిఐ వెంకటప్రసాద్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు ఈరోజు చింతకాని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని నుండి జగన్నాధపురం వెళ్లే మార్గమధ్యంలో రోడ్లపై అడ్డుగా వున్న చెట్ల పొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు

ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్సై వీరేందర్,సర్పంచ్ మనోహర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రోడ్డు సేఫ్టీ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.





## ఎయిరిండియా ఉద్యోగులకు షేర్ల ప్రోత్సాహకం

నష్టాల్లో ఉన్న విమానయాన సంస్థ ఎయిరిండియాను లాభాల దిశగా నడిపించేందుకు టాటా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములుగా మార్చే ఉద్దేశంతో పనితీరు ఆధారంగా షేర్లను అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ పథకానికి 'పీఎస్ఓపీ 2026' అని పేరు పెట్టగా, ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ పథకం కింద పైలట్లు, ఇంజనీర్లు, ఉన్నత స్థాయి నిర్వహణ సిబ్బంది సహా అర్హులైన ఉద్యోగులకు సంస్థ షేర్ ఆప్షన్లు కేటాయించనుంది. ఉద్యోగులు ఈ షేర్లను తక్కువ ముఖ విలువ నుంచి మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించడం, సంస్థ వృద్ధి మరియు లాభదాయకతను పెంచడమేనని టాటా గ్రూప్ తెలిపింది. ప్రతిభావంతులను ఆకర్షించడం, వారిని సంస్థలో కొనసాగించేలా చేయడం కూడా దీని లక్ష్యంగా ఉంది. ఈ పథకం కింద మొత్తం షేర్ మూలధనంలో స్వల్ప శాతానికి సమానమైన కోట్ల సంఖ్యలో షేర్ ఆప్షన్లు జారీ చేయనున్నారు. షేర్ల కేటాయింపుకు ఒకటి నుంచి ఐదు సంవత్సరాల వరకు వెస్టింగ్ కాలాన్ని నిర్ణయించడం ద్వారా ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. అయితే ఈ షేర్లు పూర్తిగా పనితీరు ఆధారంగానే కేటాయించబడతాయి. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించని సందర్భంలో ఉద్యోగులకు తగ్గించిన షేర్లే లభించే అవకాశం ఉంటుంది. ఎవరికెంత షేర్లు ఇవ్వాలన్నది ప్రత్యేక కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని ఇతర విమానయాన సంస్థల్లో ఇలాంటి పథకాలు అమల్లో ఉండగా, ఎయిరిండియాలో కూడా ఈ నిర్ణయం ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపనుందని భావిస్తున్నారు. టాటా గ్రూప్ చేతుల్లోకి వచ్చిన తర్వాత సంస్థను మరింత బలంగా నిలబెట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో ఇది మరో కీలక అడుగుగా పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




## చిన్న సిలిండర్లకు పెరిగిన సరఫరా

దేశంలో గ్యాస్ కొరత పరిస్థితుల మధ్య కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల సిలిండర్ల సరఫరాను మరింతగా పెంచాలని కీలక నిర్ణయం తీసుకుంది. విదేశీ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్, ఇంధన సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆయిల్ సంస్థలు ఇప్పటికే చిన్న సిలిండర్లను మార్కెట్లోకి తీసుకురాగా, వీటికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో సరఫరాను విస్తరించి మరింత మందికి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. మార్చి చివరి వారంలో ప్రారంభమైన ఈ చిన్న సిలిండర్ల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు లక్షల సంఖ్యలో అమ్మకాలు జరగగా, రోజుకు భారీగా డిమాండ్ నమోదవుతోంది. ప్రత్యేకంగా వలస కార్మికులు, విద్యార్థులు, చిన్న కుటుంబాలు ఈ సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నాయి. ఈ సిలిండర్లను కొనుగోలు చేయడానికి పెద్దగా పత్రాలు అవసరం లేకపోవడం కూడా వినియోగదారులకు సౌకర్యంగా మారింది. గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాల్లో సులభంగా లభించడం వల్ల ప్రజలు వీటిని ఎంచుకుంటున్నారు. ఇదే సమయంలో పైప్ గ్యాస్ వినియోగాన్ని కూడా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఇటీవల లక్షల సంఖ్యలో కొత్త కనెక్షన్లు మంజూరు చేయడం జరిగింది. అయితే వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే పెద్ద సిలిండర్ల కొరత ఇంకా కొనసాగుతుండటంతో హోటళ్లు, రెస్టారెంట్లు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని చోట్ల అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో చిన్న సిలిండర్ల సరఫరా పెంపు ద్వారా సాధారణ వినియోగదారులకు ఉపశమనం కల్పించడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.




## రిటైర్మెంట్ తర్వాత హోమ్ లోన్ సాధ్యమేనా?

అరవై ఏళ్ల వయస్సు దాటిన తర్వాత గృహ రుణం పొందడం కష్టమనే అభిప్రాయం చాలా మందిలో ఉన్నా, సరైన ప్రణాళికతో అది సాధ్యమేనని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ దశలో బ్యాంకులు రుణాల మంజూరులో అనుసరించే ప్రమాణాలు యువకుల కంటే భిన్నంగా ఉంటాయి. భవిష్యత్ ఆదాయం కంటే ప్రస్తుతం ఉన్న స్థిరమైన ఆదాయం, రుణాన్ని తక్కువ కాలంలో తిరిగి చెల్లించే సామర్థ్యంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తారు. పదవీ విరమణ తర్వాత క్రెడిట్ ప్రొఫైల్ ప్రాధాన్యం మరింత పెరుగుతుంది. సమయానికి బకాయిలను చెల్లించడం, క్రెడిట్ వినియోగాన్ని సక్రమంగా కొనసాగించడం వంటి అంశాలు బ్యాంకులకు విశ్వాసాన్ని కలిగిస్తాయి. చిన్న మొత్తాల్లో అయినా క్రెడిట్ కార్డు వినియోగించి, సమయానికి చెల్లింపులు చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను నిరూపించుకోవచ్చు. అదే విధంగా పెన్షన్, అద్దె ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్ ల వడ్డీ వంటి నిరంతర ఆదాయ వనరులు ఉంటే రుణం పొందే అవకాశాలు పెరుగుతాయి. ఇంకా సహ దరఖాస్తుదారు అంశం కూడా కీలకంగా మారుతుంది. తక్కువ వయస్సు గల, స్థిరమైన ఆదాయం ఉన్న కుటుంబ సభ్యుడిని సహ దరఖాస్తుదారుగా చేర్చితే బ్యాంకుల రిస్క్ తగ్గి రుణం ఆమోదం సులభమవుతుంది. అలాగే ఎక్కువ డౌన్ పేమెంట్ చెల్లించడం ద్వారా రుణ మొత్తాన్ని తగ్గిస్తే, ఈఎంఐ భారం కూడా తగ్గుతుంది. మొత్తంగా చూసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత హోమ్ లోన్ పొందడం పూర్తిగా అసాధ్యం కాదు. స్థిరమైన ఆదాయం, మంచి క్రెడిట్ చరిత్ర, సరైన ఆర్థిక ప్రణాళిక ఉంటే ఈ దశలో కూడా గృహ రుణం సులభంగా పొందవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ‘పెద్ది’ లుక్‌లో మెరిసిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఎస్క్వైర్ ఇండియా తాజా సంచిక కవర్ పేజీపై ఆయన స్టైలిష్ లుక్‌లో మెరిసారు. హాంకాంగ్‌లో నిర్వహించిన ఈ ప్రత్యేక ఫోటోషూట్‌లో చరణ్ తన కొత్త అవతారంతో అభిమానులను ఆకట్టుకున్నారు.

ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ‘పెద్ది’ సినిమా కోసం రామ్ చరణ్ పెంచుకున్న కొత్త హెయిర్‌స్టైల్, గెటప్‌తోనే ఈ ఫోటోషూట్‌లో కనిపించడం విశేషం. ఈ లుక్‌లో ఆయన మరింత రగ్గెడ్, స్టైలిష్‌గా కనిపిస్తూ గ్లోబల్ స్టార్ ఇమేజ్‌కు తగినట్టుగా మెప్పించారు. ఫోటోలు విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో సంచలనం సృష్టించాయి. రామ్ చరణ్‌ను “ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ శక్తి”గా ఎస్క్వైర్ ఇండియా ప్రశంసించింది. భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గుర్తింపును ఈ కవర్ పేజీ మరింత బలపరిచిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫోటోషూట్ ద్వారా రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త స్టైల్‌లో ఆవిష్కరించామని పత్రిక ప్రతినిధులు తెలిపారు. సంప్రదాయం, ఆధునికత కలగలిపిన ఈ లుక్‌లో చరణ్ వ్యక్తిత్వం మరింత హైలైట్ అయిందని పేర్కొన్నారు. మొత్తానికి ‘పెద్ది’ సినిమా కోసం చేసిన ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో పాటు, అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై చోటు సంపాదించడం ద్వారా రామ్ చరణ్ మరోసారి తన గ్లోబల్ స్టార్డమ్‌ను నిరూపించుకున్నారు. అభిమానులు ఈ ఫోటోలపై ప్రశంసలు కురిపిస్తూ, “గ్లోబల్ స్టార్‌కు ఇదే సరైన గుర్తింపు” అంటూ సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు.



# వేసవిలో అదృష్ట పరీక్షకు మృణాల్, పూజా రెడీ

సినీ రంగంలో ఎప్పుడూ అంచనాలు పెట్టుకున్న సినిమాలు సక్సెస్ కాకపోవడం, అనూహ్యంగా ఇతర ప్రాజెక్టులు కెరీర్‌ను మలుపుతిప్పడం సహజమే. ప్రస్తుతం ఇదే పరిస్థితి హీరోయిన్లు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ల విషయంలో కనిపిస్తోంది. ఈ వేసవిలో బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో వీరిద్దరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

‘రెట్రో’ తర్వాత మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న పూజా హెగ్డే, ఈ ఏడాది ‘జననాయకన్’తో శుభారంభం అవుతుందని భావించారు. అయితే సెన్సార్ సమస్యలు, లీకుల కారణంగా ఆ సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొనడంతో, ప్రస్తుతం ఆమె పూర్తి దృష్టి బాలీవుడ్ చిత్రం ‘హై జవానీతో ఇష్క్ హోనా హై’పై పడింది. ఈ సినిమాలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నారు. ముందుగా జూన్ 12న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని మే 22కే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో సమ్మర్ సీజన్‌లోనే పూజా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది.

ఇక అదే చిత్రంలో మరో హీరోయిన్‌గా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ ఇప్పటికే ఈ సమ్మర్‌లో ‘డెకాయిట్’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, తొలి రోజు కలెక్షన్లు మాత్రం బాగానే వచ్చినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మృణాల్ చేసిన పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రకు మంచి పేరు రావడం ఆమెకు ప్లస్‌గా మారింది. అలాగే భవిష్యత్తులో అల్లు అర్జున్‌తో కలిసి నటించే అవకాశం ఉందనే టాక్ కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఆ అవకాశం కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని మృణాల్ తెలిపినట్లు సమాచారం. మరోవైపు ‘హై జవానీతో ఇష్క్ హోనా హై’ సినిమా విడుదల కోసం కూడా ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మొత్తానికి ఈ వేసవిలో బాలీవుడ్ చిత్రం ద్వారా పూజా, మృణాల్ ఇద్దరూ తమ కెరీర్‌కు కొత్త ఊపు తీసుకురావాలని భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమా వారికి ఎంతవరకు సక్సెస్ తీసుకొస్తుందో చూడాలి.

# హాట్ సమ్మర్‌లో చిన్న సినిమాల సందడి

ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. విలేజ్ కామెడీ ఎంటర్టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి.

కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న ‘తిమ్మరాజుపల్లి టీవీ’ సినిమా కొత్త ప్రతిభను ప్రోత్సహించే ప్రయత్నంగా తెరకెక్కింది. 90ల నేపథ్యంలో రూపొందిన ఈ గ్రామీణ వినోదాత్మక చిత్రం అప్పటి జీవనశైలిని గుర్తు చేసేలా ఉంటుందని సమాచారం. కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇక తిరువీర్ నటిస్తున్న ‘పాపం ప్రతాప్’ సినిమా కూడా అదే రోజున విడుదల కానుంది. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట జీవితంలో నాలుగు రోజుల్లో జరిగే పరిణామాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కింది. కుటుంబ భావోద్వేగాలతో పాటు ప్రేమ అంశాలు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

యువ హీరో నాగశౌర్య నటించిన ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’ చిత్రం కూడా ఈ వారం విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ‘తెరచాప’ అనే మరో చిన్న చిత్రం కూడా థియేటర్లలోకి రానుంది.



మరోవైపు మలయాళ నటుడు టొవినో థామస్ నటించిన ‘పల్లి చట్టంబి’ చిత్రం ఏప్రిల్ 15న విడుదల కానుంది. 1950 60 దశకంలోని చారిత్రక నేపథ్యంలో రూపొందిన ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెలుగులోనూ విడుదలవుతోంది. యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇలా గ్రామీణ నేపథ్యం, ప్రేమ కథలు, యాక్షన్ అంశాలతో విభిన్న జానర్లలో తెరకెక్కిన ఈ చిన్న సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానుండటం విశేషం. పెద్ద సినిమాల మధ్య పోటీ ఉన్నప్పటికీ మంచి కథ, సహజమైన నటన ఉంటే చిన్న సినిమాలు కూడా విజయాన్ని సాధించగలవని మేకర్స్ విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ మూడో వారం థియేటర్లలో చిన్న సినిమాల సందడి ఎలా ఉండబోతుందో చూడాలి.

# గోపీచంద్ ‘భరతవర్ష’ గ్లింప్స్ విడుదల



యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస పరాజయాల తర్వాత ఘన విజయం కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో ‘భరతవర్ష’ అనే శక్తివంతమైన శీర్షికతో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలైన వెంటనే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

తాజాగా విడుదలైన గ్లింప్స్‌లో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు రోమాలు నిక్కబొడుచుకునేలా ఉన్నాయి. అద్భుతమైన దృశ్యాలు, నేపథ్య సంగీతం, యాక్షన్ అంశాలు అన్నీ కలిసివచ్చి ఈ సినిమా భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయి.

‘భరతవర్ష’ అనే పేరుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పురాణాల ప్రకారం హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతాన్ని సూచించే పేరే భరతవర్షం. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చెబుతారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం దేశభక్తి, చరిత్ర, పురాణ అంశాలను మేళవించిన పీరియాడికల్ యాక్షన్ కథగా రూపొందుతున్నట్లు సమాచారం.

ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందని తెలుస్తోంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను నిర్మిస్తున్న మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. గోపీచంద్ కెరీర్‌లో ఇది కీలక మలుపు కావొచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# లవ్‌లో ఫెయిలా..? కృతి శెట్టి క్లారిటీ

టాలీవుడ్‌లో బేబమ్మగా గుర్తింపు పొందిన కృతి శెట్టి ప్రేమ గురించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రేమ అనేది ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన అనుభూతి అని చెబుతూ, తన వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించారు.

‘ఉప్పెన’ తర్వాత తాను చేసిన సినిమాల్లో పర్ఫెక్ట్ లవ్ స్టోరీ అనిపించలేదని, అయితే తాజాగా చేసిన ‘లవ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ’ చిత్రంతో ఆ ఫీలింగ్ వచ్చిందని కృతి పేర్కొన్నారు. ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమని, ముఖ్యంగా సీనియర్ నటి నయనతారతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా అనిపించిందని తెలిపారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని మంచి సూచనలు కూడా ఆమె నుంచి పొందినట్లు చెప్పారు.

తాను ఇప్పటికే ప్రేమలో విఫలమయ్యారా అన్న ప్రశ్నకు కృతి స్పష్టత ఇచ్చారు. అలాంటి విషయం ఏదీ లేదని, అది కేవలం ఒక గేమ్‌లో భాగంగా చెప్పిన మాట మాత్రమేనని వెల్లడించారు. ఇంకా కొన్ని సంవత్సరాల పాటు ప్రేమ గురించి ఆలోచించనని, ముందుగా కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎవరిని ప్రేమిస్తానో, వారినే వివాహం చేసుకుంటానని, ఆ విషయాన్ని మొదటి నుంచే తన కుటుంబానికి చెప్పేలా ఉంటానని తెలిపారు.

ప్రేమ గురించి తన అభిరుచిని వివరిస్తూ, 96, సీతారామం చిత్రాల్లో చూపించిన భావోద్వేగ ప్రేమ తనకు చాలా దగ్గరగా ఉంటుందని కృతి అన్నారు. అలాంటి ఫీల్‌తో కూడిన ప్రేమనే తాను ఇష్టపడతానని వెల్లడించారు.

తమిళ సినిమాల్లోనే స్థిరపడతారా అనే ప్రశ్నకు స్పందిస్తూ, తెలుగు తనకు చాలా దగ్గరగా ఉంటుందని, సరైన విజయాలు రాకపోయినా తన తప్పేమీ లేదని అన్నారు. ‘ఐరన్ లెగ్’ అంటూ వస్తున్న విమర్శలు తనను బాధిస్తున్నాయని చెప్పారు. అయితే త్వరలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయబోయే సినిమాతో మళ్లీ మంచి సక్సెస్ సాధిస్తాననే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in